సాక్షి పల్నాడు

గురువారం ı 21 ı ఆగస్టు ı 2025



సబ్ జైల్‌లో ఆకస్మిక తనిఖీ

గురజాల: గురజాల సబ్‌జైల్‌ను డీఎస్పీ బి.జగదీష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జైలు సూపరింటెండెంట్‌కు పలు సూచనలు చేశారు.



పైడమ్మతల్లి వార్షికోత్సవం

ముప్పాళ్ళ: ముప్పాళ్లలో వేంచేసియున్న శ్రీపైడమ్మతల్లి వార్షిక తిరునాళ్ల బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా విఘ్నేశ్వరుడి పూజలు



సత్తెనపల్లి: గాంధీ చౌక్ విఘ్నేశ్వరుని ఆలయాన్ని బుధవారం పునఃప్రారంభించారు. విఘ్నేశ్వరునికి పలురకాల పుష్పాలతో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

డీఏ బకాయిల కోసం హైకోర్టుకు..

ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు శాంతిబాయి



మాచర్ల రూరల్: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులకు న్యాయబద్ధంగా దక్కాల్సిన డీఏ బకాయిల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీసీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సాంబేలు శాంతిబాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. లక్షలాది మంది ఉద్యమ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏల కోసం అసోసియేషన్ తరపున ఈ నెల 14న హైకోర్టులో పిటీషన్ వేసినట్లు ఆమె చెప్పారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర దాటుతున్నా ఉద్యోగులకు అందించాల్సిన టీఏ, డీఏలను చెల్లించటంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ హై కోర్టును ఆశ్రయించామని ఆమె తెలిపారు.

ఐటీఐ ప్రవేశాల దరఖాస్తుకు 26 వరకు గడువు

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 26వ తేదీలోపు వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలలో 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఈ నెల 29, 30వ తేదీలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు సెల్ నెంబర్ 93914 02683లో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగిని నిరసన దీక్ష విరమణ



తెనాలి రూరల్: తెనాలి టెలిఫోన్ ఎక్స్చేంజ్ ఆవరణలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ తెనాలి టెలికాం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె. పద్మావతి చేపట్టిన నిరసన దీక్షను బుధవారం విరమించారు. 10 రోజులుగా ఆమె దీక్ష చేస్తుండడంతో అఖిల భారత బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగ సంఘాల నాయకులు గుంటూరు నుంచి తెనాలికి వచ్చారు. దీక్షలో కూర్చున్న ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అధికారుల వద్దకు వెళ్లి ఆమెకు జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని, అదేవిధంగా ప్రైవేటు ఏజెన్సీని తొలగించాలని డిమాండ్ చేశారు. సరిపడా ఉద్యోగులు ఉన్న తెనాలిలో ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వాల్సిన అవసరం లేదని వారు అధికారులకు సూచించారు. అనంతరం పద్మావతి చేత దీక్ష విరమింపజేశారు.

బంగారం వ్యాపారిపై రౌడీషీటర్ దాడి

రూ.4 లక్షలు గుంజుకుని పరారీ



గాయపడిన వ్యాపారి రెహమాన్

వేటపాలెం: బంగారు వ్యాపారిపై రౌడీషీటర్ దాడి చేసి రూ.4 లక్షలను బలవంతంగా లాక్కున్న ఘటన అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో బుధవారం చోటు చేసుకుంది. గాయపడిన బంగారు వ్యాపారి చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ, అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశారు. అక్కాయపాలెం లక్ష్మీపురానికి చెందిన రౌడీషీటర్ మల్లెల రాజేష్ తన వద్ద పాత బంగారం ఉందని, తక్కువ ధరకు అమ్ముతామని తన సెల్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో ఉంచాడు. విజయవాడకు చెందిన బంగారు వ్యాపారి రెహమాన్ ప్రకటన చూసి రాజేష్‌కు ఫోన్ చేశాడు. దీంతో లక్ష్మీపురం రావాలని రెహమాన్‌కి చెప్పాడు. ఇది నమ్మిన అతడు బంగారం కొనుగోలు కోసం లక్ష్మీపురంలోని రౌడీషీటర్ ఇంటికి వచ్చాడు. వెంటనే వ్యాపారిపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.4 లక్షలను రాజేష్ లాక్కున్నాడు. అక్కడ నుంచి తప్పించుకొన్న వ్యాపారి చీరాల ఏరియా వైద్యశాలకు చేరి ఫిర్యాదు చేశాడు. రౌడీ షీటర్‌పై అనేక పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి.



తాత్కాలిక వైకల్యమట..



అందుకున్న నోటీసు

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కాసర్ల వెంకటరెడ్డి. పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామం. ఇతనికి ఓ ప్రమాదం వల్ల కుడి కాలు మోకాలి పైవరకు కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఒంటి కాలితో కర్రల సహాయంతో కష్టంగా నడవగలడు. గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్ ఆధారంగా వికలాంగ పింఛన్ వచ్చేది. కూటమి ప్రభుత్వం వెరిఫికేషన్, రీ అసెస్‌మెంట్ పేరిట పరిశీలన చేసి పింఛన్‌ను రద్దు చేసింది. ఆ విషయాన్ని ధ్రువపరుస్తూ ఇచ్చిన నోటీసులో వారు చెప్పిన సాకు కూటమి ప్రభుత్వం కుతంత్రాలను అద్దంపట్టేలా ఉంది. వెంకటరెడ్డికి ఒక కాలు మోకాలిపై వరకు పోవడం తాత్కాలిక వైకల్యమని తేల్చారట. ఈ కారణంతో పింఛన్ రద్దు చేశామని రాతపూర్వకంగా తెలిపారు. తాత్కాలికమంటే పోయిన కాలు భవిష్యత్తులో పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తుందా అన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

కన్ను పోవడం వైకల్యం కాదేమో...



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు పుణ్యాల సీతారామిరెడ్డి. పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామం. ఇతనికి ఒక కన్ను పూర్తిగా పోయింది. ఈ నెల వరకు వికలాంగ పింఛన్ కింద రూ.6 వేలు అందేది. అయితే కూటమి ప్రభుత్వానికి కన్నుగిట్టిందేమో వెరిఫికేషన్ పేరిట నీకు వైకల్యం లేదంటూ పింఛన్ రద్దు చేశారు. అయ్యా నా వైకల్యం చూడండి మహాప్రభో.. అంటూ బుధవారం పిడుగురాళ్ల ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి అధికారులను దీనంగా వేడుకున్నాడు.

ఈమె అనర్హురాలట...



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పచ్చవ వీరమ్మ, నాదెండ్ల. అవివాహితురాలు, వయసు 55 ఏళ్లు. పుట్టుకతోనే శారీరక, మానసికంగా వైకల్యం ఉంది. దశాబ్దాల కాలంగా ప్రభుత్వం నుంచి వికలాంగ పింఛన్ తీసుకొని జీవనం సాగిస్తోంది. అయితే కూటమి ప్రభుత్వంలో వెరిఫికేషన్ పేరిట ఈమె పింఛన్‌కు అనర్హురాలని నోటీసులు అందించి తొలగిస్తున్నామని తెలిపారు. కావాలంటే మరోసారి దరఖాస్తు చేసుకోమని సూచించారు. అన్ని సరిగా ఉన్నవారే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేరు. మరి ఇలాంటి స్థితిలో ఉన్న మహిళ మళ్లీ పింఛన్ తెచ్చుకోవడం ఎలా? ఇలాంటి ఉదాహరణలు జిల్లాలో కోకొల్లలు.

పింఛన్ల పంపిణీలో కూటమి వైకల్యం

- అన్ని అర్హతలున్నా అకారణంగా నోటీసులు జారీచేసిన కూటమి ప్రభుత్వం
- జిల్లావ్యాప్తంగా 35,096 దివ్యాంగ పింఛన్లు ఉండగా తాజాగా 3,162 మందిని తొలగింపు
- ఏడాదిగా ఇప్పటికే మరో 11 వేల పింఛన్లు కోత
- కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా ఉన్నవాటిలోనూ కత్తిరింపు

సాక్షి, నరసరావుపేట: అధికారంలోకి వచ్చిన తరువాత వికలాంగ పింఛన్ నగదు మొత్తాన్ని రూ.6 వేలకు పెంచామని ఓ వైపు గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం మరోవైపు ఉన్నఫళంగా అర్హుల పింఛన్లు నిర్దయగా తొలగించేస్తోంది. వికలాంగ ధ్రువపత్రాలతో దశాబ్దాల కాలంగా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులను వెరిఫికేషన్, రీ అసెస్‌మెంట్ పేరిట పరిశీలన చేసి పింఛన్ రద్దు చేస్తున్నట్టు నోటీసులు పంపుతున్నారు. అర్హతుంటే మళ్లీ దరఖాస్తు చేసుకొని పింఛన్ పొందాలంటూ చెబుతున్నారు. ఒక కాలు, ఒక కన్ను లేకపోయినా వారు దివ్యాంగులు కాదంటూ లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తున్నారు.

3162 మందికి అనర్హత

పల్నాడు జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో గత నాలుగైదు రోజులుగా ఏకంగా 3,162 మందిని వికలాంగ పింఛన్‌కు అనర్హులుగా పేర్కొంటూ నోటీసులు అందజేస్తున్నారు.

వెరిఫికేషన్ పేరిట భారీగా తొలగింపు



పిడుగురాళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో గోడు వెళ్లబోసుకుంటున్న నోటీసు అందుకున్న దివ్యాంగులు

ఇందులో దివ్యాంగులు 3,086 మంది, పక్షవాతంతో మంచానపడ్డ వారు 51 మంది, ప్రమాదాలు, కండరాల వ్యాధితో బాధపడుతున్న వారు 25 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 35,096 మందికి వికలాంగ పింఛన్లు ఉండగా అందులో రానున్న నెలలో 3,162 పింఛన్లు రద్దు కానున్నాయి. వీరంతా మండల కేంద్రాలలోని ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తమకు అన్యాయం చేయొద్దని, వైకల్యం చూసి కనికరించమని వేడుకుంటున్నారు.

కొత్త పింఛన్లు లేవు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్నాడు జిల్లావ్యాప్తంగా సుమారు 11 వేలకు పైగా పింఛన్లు తొలగించారు. కొందరు హైకోర్టు మెట్లు ఎక్కి మళ్లీ పింఛన్‌ను తిరిగిపొందారు. తాజాగా ఇప్పుడు మరో 3 వేలకు పైగా పింఛన్లను తొలగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. 50 ఏళ్లు పైబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వృద్ధాప్య పింఛన్ ఇస్తామన్న హామీని ఇప్పటివరకు అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వ తీరుతో జిల్లాలో సుమారు 2 లక్షలకు పైగా అర్హులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. దీన్ని అమలు చేయకపోవడంతో జిల్లాలో అర్హులైన వారు ఏడాదికి సుమారు రూ.960 కోట్లు కోల్పోతున్నారు.

జిల్లాలో నోటీసులు అందుకున్నవారు..

నియోజకవర్గం	దివ్యాంగులు	పక్షవాతంతో మంచాన పడ్డవారు	ప్రమాదాలు, కండరాల వ్యాధితో వైకల్యం గల వారు	మొత్తం
చిలకలూరిపేట	824	8	6	838
గురజాల	702	7	4	713
మాచర్ల	168	11	0	179
నరసరావుపేట	532	12	3	547
పెదకూరపాడు	171	3	3	177
సత్తెనపల్లి	360	1	5	366
వినుకొండ	329	9	4	342
మొత్తం	3,086	51	25	3,162

నడవలేని నాకు పింఛన్ తొలగించారు



ప్రమాదంలో నాకు రెండు కాళ్లు విరిగిపోయాయి. పెద్ద సర్జరీ చేసి రెండు కాళ్లలో రాడ్లు వేశారు. అయినా సరిగా నడవలేని పరిస్థితి. నా దుస్థితి చూసి వికలాంగ పింఛన్ మంజూరు చేశారు. అయితే నాకు వైకల్యం లేదని వికలాంగ పింఛన్ రద్దు చేస్తున్నామని నోటీసు ఇచ్చారు. ఏ పని చేసుకోలేని నాకు ఆ రూ.6 వేలు జీవనాధారంగా ఉపయోగపడేది. ఉన్నఫళంగా ఇలా తొలగిస్తే నేను ఏమైపోవాలి.

– బత్తుల వీరబ్రహ్మం, దొండపాడు, వినుకొండ రూరల్

గతంలో ఏటా రెండుసార్లు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదిలో రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. అర్హతే ప్రామాణికంగా ఏటా జనవరి, జూలై నెలల్లో ఎటువంటి సిఫార్సు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరిగేది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేకుండా, ఎవరినీ కలవాల్సిన అవసరం లేకుండా పింఛన్‌కు అర్హత సాధించేవారు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన తరువాత జిల్లాలో ఒక్కటంటే ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయలేదు. అన్ని అర్హతలుండి కొత్త పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కనీసం కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారో కూడా చెప్పలేని దుస్థితి నెలకొనడంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు గ్రామ, వార్డు సచివాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

'గుడ్ మార్నింగ్' ఆపేందుకు కుట్ర

- ఎన్ని కేసులు పెట్టినా కార్యక్రమం ఆగదు
- పుట్టిన రోజు కేక్ కట్ చేస్తే కేసులా..?
- పోలీసు యాక్ట్ 30 టీడీపీ వారికి వర్తించదా..?
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందనే కారణంతో ఎలాగైనా ఆ కార్యక్రమాన్ని ఆపాలనే కుట్రతో ఎమ్మెల్యే, టీడీపీ నాయకుల ఆదేశాలతోనే పోలీసులు తనపై కేసులు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నరసరావుపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగు వారాల నుంచి తాను పట్టణంలో పారిశుద్ధ్యం, పెన్షన్లు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే నిమిత్తం 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట' నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం ప్రారంభించినప్పుడు పోలీసులు పట్టణంలో 30 యాక్ట్ అమల్లో ఉందని, కార్యక్రమం నిర్వహించటానికి వీలులేదని నోటీసు ఇచ్చారన్నారు. అదే రోజు టీడీపీ పట్టణ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం పేరుతో భారీగా ర్యాలీ చేశారని, వారికి ఎటువంటి నోటీసు ఇవ్వలేదని, ర్యాలీ సందర్భంగా ఎంత ట్రాఫిక్ ఆగిపోయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

టీడీపీ వారికో న్యాయం.. మాకో న్యాయమా ?

గత ఆదివారం కార్యక్రమం అనంతరం ప్రకాష్‌నగర్ రిక్షా సెంటర్‌లో కాఫీ తాగేందుకు ఆగామని, అక్కడ తమ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పుట్టినరోజు అని తెలిసి రోడ్డు మార్జిన్‌లో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగనీయకుండా కేక్ కట్ చేశామన్నారు. కార్యక్రమం మొత్తం పది నిమిషాల్లో ముగిసిందని, అయినప్పటికీ తమ నాయకులు పదహారు మందిపై కేసు పెట్టారన్నారు. పుట్టినరోజు జరుపుకొన్న తమ పార్టీ నాయకుడిని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటలవరకు స్టేషన్‌లో కూర్చోబెట్టడం అన్యాయమన్నారు. మంగళవారం నాడు టీడీపీ నాయకులు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం పేరుతో మూడు గంటలపాటు పట్టణంలో అనేక రోడ్లు బ్లాక్ చేశారని, మరి వారిపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. ఎవరెన్ని అడ్డంకులు, ఎన్ని అరెస్టులు చేసినా గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

దేవునికి ప్రార్థనలు చేసుకునే హక్కు కూడా లేదా?

అక్రమ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేసి రాజమండ్రి జైల్లో ఉంచారని, ఆయన యోగక్షేమాల నిమిత్తం భగవంతుని ప్రార్థించుకునే క్రమంలో ఆ నియోజకవర్గ పార్టీ నాయకులు కొంతమంది మెట్ల మార్గం ద్వారా పాదయాత్రగా తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి వద్దకు వెళుతుండగా పోలీసులు అరెస్టు చేయటం దారుణమన్నారు.

చిన్న వర్షానికే మునక

- పొంగిపొర్లుతున్న పాటిబండ్ల వాగు
- ఏటా నీట మునుగుతున్న వేలాది ఎకరాలు
- వాగుపై కంప, వ్యర్థాలు, ఆక్రమణలతోనే దుస్థితి



ఉధృతంగా ప్రవహిస్తున్న పాటిబండ్ల వాగు

పెదకూరపాడు: పాటిబండ్ల వాగు ఉధృతికి ప్రతి ఏటా వేల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షాలకు సైతం వాగు పొంగిపొర్లి సాగు భూములపై పడుతుంది. పాటిబండ్ల వాగు పల్నాడు జిల్లాలోని లింగంగుంట్ల, పొడపాడు, జలాల్‌పురం, పెద్దమక్కెన, పెదకూరపాడు, బలుసుపాడు, కంభంపాడు, పరస, నరుకుళ్లపాడు, లింగాపురం, వైకుంఠపురం మీదుగా పారుతుంది. పేరమ్మవాగు, పిల్లవాగుల నీరుకూడ ఇందులోనే కలుస్తాయి. ఈ వాగు కింద సుమారు మూడువేల ఎకరాలు ఉన్నాయి. ప్రతి ఏడాది చిన్నపాటి వర్షాలకు సైతం వాగు పొంగిపొర్లుతుండడంతో పంటలు జలమయమవుతున్నాయి.

వ్యర్థాలు, ఆక్రమణలే కారణం

ఏళ్ల తరబడి వాగుకు పూడిక తీయకపోవడం, వాగులో కొట్టుకు వచ్చే వ్యర్థాలు, వాగు ఇరుపక్కల ఉన్న ముళ్లకంప ఎండి, ఇందులో పడటం, తదితర కారణాలతో వాగులో నీరు ముందుకు పారడం లేదు. అంతేకాకుండా పలువురు ఈ వాగు గట్ల వరకు ఆక్రమిస్తూ, తమ సరిహద్దులను విస్తరిస్తుండడం కూడా ఏటా ఈ దుస్థితికి కారణం అని చెప్పుకోవచ్చు. వాగులో పూడిక తీయాలని, కంపచెట్లు, ఆక్రమణలు తొలగించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం శూన్యమని స్థానిక రైతులు వాపోతున్నారు.



ఇటీవల కురిసిన వర్షాలకు వాగు పొంగడంతో నీట మునిగిన పంటపొలాలు

శాశ్వత పరిష్కారం చూపించండి..



పాటిబండ్ల వాగు పూడికతీస్తే పంటలు మునగవు. నేను వేసిన రెండు ఎకరాల పైరు ఇటీవల కురిసిన భారీ వర్షానికి వాగు పొంగడంతో నీట మునిగింది. ప్రతి ఏడాది ఇదే సమస్య. ఆశతో సాగు చేస్తే వాగు పొర్లడం, పంట పీకడం జరుగుతుంది. వాగు పక్కన ఆక్రమణలు కూడా తొలగించాలి.

– పఠాన్ ఇసూబ్‌ఖాన్, రైతు, పాటిబండ్ల

వరినాట్లు వేసిన జిల్లా కలెక్టర్



వరినాట్లు వేస్తూ కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పిడుగురాళ్ల రూరల్: నిత్యం అధికార కార్యక్రమాలతో బిజీబిజీ ఉండే జిల్లా కలెక్టర్ కాసేపు రైతులతో కలిసి పొలం పనుల్లో పాల్గొన్నారు. మండలంలోని వీరాపురం గ్రామంలో బుధవారం కూలీలు వరి నాట్లు వేస్తుంటే అటుగా కారులో వెళ్తున్న కలెక్టర్ అరుణ్ బాబు కూలీల వద్దకు వచ్చారు. వారిని పలకరిస్తూ రోజుకు ఎంత ఆదాయం వస్తుంది అని తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి వరి నాట్లు వేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో యూరియా, డీఏపీకి కొరతలేదని రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ సంవత్సరం నాగార్జునసాగర్‌కు సమృద్ధిగా నీరు చేరడంతో పాటు భూగర్భ జలాలు కూడా గత సంవత్సరం కంటే అధికంగా పెరిగాయని నీటికి ఇబ్బంది లేదన్నారు. ఏడీఏ బి.కృష్ణదేవరయలు, ఆర్డీఓ మురళి, తహసీల్దార్ మధుబాబు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆయన వెంట ఉన్నారు.

గణపూజకు సిద్ధం

చిన్నా, పెద్ద సంతోషంగా జరుపుకొనే పండుగ వినాయక చవితి. ఈనెల 27న పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు వినాయక కమిటీలు, నిర్వాహకులు, యువకులు సిద్ధమవుతున్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు పోటీ పడుతున్నారు. రాజస్థాన్, హైదరాబాద్, విజయవాడ, వరంగల్, బెంగళూరు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, వ్యాపారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో భారీ వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. అడుగు నుంచి 20 అడుగుల ప్రతిమలను తీర్చిదిద్ది, విక్రయిస్తున్నారు. అయితే పర్యావరణానికి హానిచేసే విగ్రహాలు వద్దని, మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. - సత్తెనపల్లి



సత్తెనపల్లి మండలం వెన్నాదేవి వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న భారీ గణనాథుడి విగ్రహాలు

రైతులు పొగాకు సాగుచేయొద్దు

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలో పొగాకు పంటను రైతులు ఎవరూ సాగుచేయొద్దని, నారుమళ్లు వేయరాదని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 2024-25లో 3124మంది రైతులు 10,954 ఎకరాల్లో బ్లాక్ బర్లీ పొగాకు పంటను సాగుచేశారని, దీని వలన 1,21,010 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. అధిక దిగుబడితో పొగాకు వ్యాపారులు రైతుల నుంచి పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేపట్టిందన్నారు. అందువలన ఈ ఏడాది రైతులు ఎవరూ కంపెనీ వ్యక్తుల నుంచి బాండ్లు తీసుకోరాదని, పొగాకు నారుమళ్లు వేయరాదని కోరారు. పొగాకుకు బదులుగా అధిక దిగుబడిని ఇచ్చే పంటలను సాగుచేయాలని కోరారు. మధ్యవర్తులు ఎవరైనా సాగుకు ప్రోత్సహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతేడాది పండిన పొగాకు నిల్వలను కొనుగోలుచేయకుండా ఈ ఏడాది సాగుచేయాలని ప్రోత్సహించటం క్షమించరాని నేరమన్నారు. రైతులు కంపెనీ వారి మాటలు వినిమోసపోవద్దని సూచించారు. పూర్తి బాధ్యతను గ్రామ, మండల స్థాయిలో వ్యవసాయాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు.

25న సీజ్ చేసిన బియ్యానికి మళ్లీ వేలం

నరసరావుపేట: ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ అండర్ సెక్షన్ 6ఏ కింద సీజ్ చేసిన 6,453 క్వింటాళ్ల రేషన్ బియ్యానికి జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సమక్షంలో ఈనెల 25న మరోసారి వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎం.వి.ప్రసాదు బుధవారం పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఈనెల 12న నిర్వహించిన వేలంలో సరైన ధర రానందున ఈ నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు. బహిరంగ వేలం ప్రకటనలోని నియమ నిబంధనల మేరకు ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు.

పోస్టల్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట టౌన్: తపాలా శాఖ ఆధ్వర్యంలో దీన్ దయాల్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జాఫర్ సాధిక్ తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు స్కాలర్‌షిప్‌ను తపాలా శాఖ ప్రవేశపెట్టిందన్నారు. తపాలా శాఖ నిర్వహించే ఫిలాటెలి క్విజ్ మరియు ఫిలాటెలి ప్రాజెక్ట్‌ల ఆధారంగా ఏడాదికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ పొందవచ్చన్నారు. విద్యార్థి 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలలో చదువుతూ, సంబంధిత పాఠశాలల్లో ఫిలాటెలి క్లబ్ సభ్యుడై ఉండాలన్నారు. పాఠశాలల్లో ఫిలాటెలి క్లబ్ లేకపోతే అభ్యర్థి తన సొంత ఫిలాటెలి అకౌంట్ కలిగి ఉండాలన్నారు. ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలన్నారు.

నీట్ పీజీ సెట్‌లో డాక్టర్ ప్రవల్లికకు 1820 ర్యాంక్



నరసరావుపేట ఈస్ట్: మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పీజీ-2025 పరీక్షలో పట్టణానికి చెందిన డాక్టర్ ముద్దా ప్రవల్లిక ఓపెన్ క్యాటగిరీలో 1820 ర్యాంక్ సాధించింది. వైజాగ్ ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ప్రవల్లిక నీట్ పీజీ సెట్‌లో 613 మార్కులతో ఉత్తమ ర్యాంక్ సాధించింది. డాక్టర్ ప్రవల్లిక తండ్రి ముద్దా రమేష్ పట్టణంలోని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తుండగా, తల్లి ఉషారాణి గృహిణి. చిన్న పిల్లలకు వైద్యసేవలు అందించేందుకు తాను పిడియాట్రిక్ విభాగంలో పీజీ చేయనున్నట్లు డాక్టర్ ప్రవల్లిక తెలిపారు.

జిల్లాలో 69.4 మి.మీ వర్షం

నరసరావుపేట: గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలోని 28 మండలాలకుగాను 14 మండలాల్లో వర్షం పడలేదని జిల్లా అధికారులు పేర్కొన్నారు. మిగిలిన మండలాల్లో 69.4 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. అత్యధికంగా మాచర్లలో 20.2 మి.మీ వర్షం పడగా అత్యల్పంగా 0.6 అమరావతిలో కురిసింది. వెల్దుర్తి 7.0, దుర్గి 8.0, గురజాల 2.0, కారంపూడి 2.4, బొల్లాపల్లి 2.4, వినుకొండ 2.8, నూజెండ్ల 1.8, శావల్యాపురం 1.4, ఈపూరు 2.6, రొంపిచర్ల 5.6, నరసరావుపేట 3.6, చిలకలూరిపేట 5.0 మి.మీ వర్షం కురిసింది.

'డీ ఫార్మసీ'లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో రెండేళ్ల కాలపరిమితి గల డీఫార్మసీ కోర్సులో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువును సాంకేతిక విద్యాశాఖ ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాస్తి ఉషారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ రెగ్యులర్, దూరవిద్య ద్వారా బైపీసీ, ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థినులతో పాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డు నుంచి తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులని తెలిపారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు కలిగిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా అడ్మిషన్ ఫీజులో మినహాయింపుతోపాటు ఉపకార వేతనాలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు సర్టిఫికెట్లతోపాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, దరఖాస్తు రుసుము రూ.400తో కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పేదల స్థలంలో పండ్ల తోట

● వినుకొండ రూరల్ మండలం అందుగుల కొత్తపాలెంలో జగనన్న కాలనీని ఆక్రమించి బత్తాయి, కొబ్బరి మొక్కలు సాగు చేస్తున్న అక్రమార్కులు

● పట్టించుకోని రెవెన్యూ అధికారులు



జగనన్న కాలనీని ఆక్రమించి బత్తాయి, కొబ్బరి మొక్కలు సాగు చేస్తున్న వైనం

వినుకొండ: కూటమి ప్రభుత్వంలోకి జగనన్న కాలనీ స్థలాలకు రక్షణ లేకుండా పోయాయి. అక్రమార్కులు యథేచ్ఛగా ఎకరాలకు ఎకరాలు ఆక్రమిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మిన్నుకుంటుండడంతో వారు చెలరేగిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. వినుకొండ రూరల్ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామంలోని సర్వే నం.194-3లో 1.80 ఎకరాలు ప్రభుత్వ భూమిని జగనన్న కాలనీ కోసం అప్పట్లో రెవెన్యూ అధికారులు సేకరించి ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో బాగు చేశారు. అదే గ్రామానికి చెందిన పిడిరిడి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని కలుపుకొని ఉండటంతో అధికారులు అతనివద్ద నుంచి ప్రభుత్వ భూమిని విడగొట్టి జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో సదరు వ్యక్తి మళ్లీ జగనన్న కాలనీకి ఇచ్చిన స్థలాన్ని ఆక్రమించి ఏకంగా కొబ్బరి, బత్తాయి మొక్కల సాగు చేపట్టాడు.

■ అదేమని లబ్ధిదారులు అడిగితే ఈ పొలం తనదేనని, తానే జగనన్న కాలనీకి ఇచ్చాడని, కాలనీ కట్టలేదు కాబట్టి తానే సాగు చేసుకుంటున్నానని తాపీగా సమాధానం ఇవ్వడంతో లబ్ధిదారులు నివ్వెరపోయారు. గతంలో ఈ స్థలం రాళ్ల గుట్ట పోరంబోకుగా రికార్డులు ఉన్నాయి. దీంతో ఈ ప్రభుత్వ భూమిని కాలనీకి కేటాయించారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత రెవెన్యూ అధికారుల్లో కూడా మార్పు వచ్చింది. ప్రస్తుతం ఈ భూమి విషయంలో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



స్థలంలో సర్వే రాళ్లు పీకేసిన దృశ్యం

ఇంటి స్థలం ఆక్రమించారు

నా భార్య మల్లీశ్వరి పేరుతో జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైంది. అయితే స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు జాప్యం కావడం, ఇంతలోనే ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడంతో ఆ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి ఏకంగా బత్తాయి, కొబ్బరి మొక్కలు సాగు చేస్తున్నాడు. అధికారులు స్పందించి పేదలకు న్యాయం చేయాలి.

– మిరియాల కోటయ్య, అందుగుల కొత్తపాలెం

చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ, చేనేత సంఘం నాయకులు

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పవర్ లూమ్స్, జెట్ లూమ్స్‌లకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తూ చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్నాయని, ఈ అంశాలను అక్టోబర్ 6, 7 తేదీలలో సత్తెనపల్లిలో జరిగే చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 11వ మహాసభలో చర్చించి పోరాటాలకు పిలుపునిస్తామని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ హెచ్చరించారు. సత్తెనపల్లిలో బుధవారం జరిగిన చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా శివ దుర్గరావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ చేనేతపై ఉన్న జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ రాష్ట్ర మహాసభలో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి అనుముల వీర బ్రహ్మం, కమిటీ సభ్యులు బిట్రా పానకాలు, పంతంగి ప్రభాకర్, గడ్డం సుసులోవ్, గనికపూడి యేసు రత్నం, వలపర్ల చిన్న దెబ్బయ్య, మోపత్తి బాబు రాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను మోసం చేసే కేటుగాడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ బి సుబ్బానాయుడు, ముసుగులో నిందితుడు

యడ్లపాడు: మృతి చెందిన వారి కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని..బీమా డబ్బులు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని యడ్లపాడు పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన చెందిన 27 ఏళ్ల చొక్కా బాబు సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో, చనిపోయిన వారి ఇంటికి వెళ్లి తాను ఎయిమ్స్ హాస్పిటల్ నుంచి వచ్చానని నమ్మబలికేవాడు. బీమా కోసం డబ్బులు అవసరమని చెప్పి అమాయకుల నగదు స్వాహా చేసి మోసానికి పాల్పడేవాడు. తాజాగా ఈనెల 14వ తేదీన యడ్లపాడు గ్రామంలో మృతి చెందిన బండి ఆంజనేయులు ఇంటికి వెళ్లి రూ.7.5 లక్షల బీమా వస్తుందని నమ్మబలికాడు. ఇందుకు రిజిస్ట్రేషన్ ఖర్చుల నిమిత్తం రూ.28 వేలు కావాలంటూ వారి నుంచి ఫోన్‌పే ద్వారా వసూలు చేశాడు. అనుమానం వచ్చి బాధితులు పోలీసుల్ని ఆశ్రయించారు. ఎస్ఐ టి. శివరామకృష్ణ కేసు నమోదు చేసుకుని కేవలం వారం రోజుల్లోనే నిందితుడిని అరెస్టు చేశారు. అతని నుంచి స్కూటీతో పాటు ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు ఉన్నాయి.. గుంటూరు అర్బన్ దిశ స్టేషన్‌లో బాలికపై లైంగికదాడి కేసు, మంగళగిరి టౌన్ స్టేషన్‌లో హైకోర్టు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి నుంచి రూ.59 లక్షల మోసగించిన కేసు, గుంటూరు దిశ స్టేషన్, రాజమండ్రి వన్‌టౌన్ స్టేషన్‌లలో ఆత్మహత్యాయత్నం కేసులు, గుంటూరు దిశా స్టేషన్‌లో నిందితుడి భార్య ఫిర్యాదుతో నమోదైన కేసులు ఉన్నాయని సీఐ వెల్లడించారు.

నవ వధువు ఆత్మహత్య



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో పారాణి ఆరకముందే ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవల్లికి చెందిన రంగనాయకమ్మ (24)కు ఈ నెల 17వ తేదీన ఉండవల్లి సెంటర్‌లో నివాసం ఉంటున్న జితేంద్రతో వివాహం చేశారు. బుధవారం జితేంద్ర తన భార్య ఉన్న గదిలో నుంచి బయటకు వచ్చాడు. పది నిమిషాల అనంతరం తిరిగి లోనికి వెళ్లేందుకు రాగా గదికి గడియ పెట్టి ఉంది. ఎన్నిసార్లు తలుపులు కొట్టినా తీయకపోవడంతో అత్తకు చెప్పాడు. ఆమె పిలిచినా రంగనాయకమ్మ స్పందించలేదు. పక్కింటి వారి సహాయంతో జితేంద్ర తలుపులు పగలగొట్టగా.. రేకుల గదిలోని ఇనుప రాడ్‌కు చున్నీతో రంగనాయకమ్మ ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే కిందకు దించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఏడాదిగా రంగనాయకమ్మకు కడుపునొప్పి ఉండడం వల్లే వివాహానికి నిరాకరించిందని, దానివల్లే ఆత్మహత్య చేసుకుందని తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

వ్యవసాయ మెగా క్రెడిట్ ఔట్ రీచ్ క్యాంపు

కొరిటెపాడు: జిల్లాలో వ్యవసాయ మెగా క్రెడిట్ ఔట్ రీచ్ క్యాంప్ 'లక్ష్య', ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సాచురేషన్ క్యాంపు (జనన సురక్ష క్యాంప్)ను నగరంపాలెంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. క్యాంపును కడప రీజియన్ రీజినల్ హెడ్ ఇ. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. లక్ష్య, ఫైనాన్షియల్ ఇంక్లూజ్ సాచురేషన్ క్యాంపునకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. క్రెడిట్ క్యాంపెయిన్ సమయంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, సీకేసీసీ రుణగ్రహీతలకు రుణాలు మంజూరు చేశామని తెలిపారు. కండ్లకుంట బ్రాంచ్ హెడ్ అశోక్‌కుమార్, సిబ్బందితోపాటు ఏపీఎం, ఇతర సీసీఏలు ఈ క్యాంపులో పాల్గొన్నారు.

గీత కులాలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో గీత కులాలకు కేటాయించిన బార్లకు గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు బుధవారం విడుదల చేశారు. జిల్లా పరిధిలోని గుంటూరు నగరపాలక సంస్థలో గౌడకు 4, గౌడ్ 2, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్‌లో గౌడకు 2, తెనాలి మున్సిపాలిటీ పరిధిలో గౌడకు, గౌడ్‌కు ఒకటి చొప్పున బార్లు కేటాయించడం జరిగిందన్నారు. ఆయా వర్గాలకు కేటాయించిన షాపుల్లో వారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29వ తేదీ దరఖాస్తులు స్వీకరిస్తామని 30న లాటరీ ద్వారా కేటాయింపు ఉంటుందన్నారు.

డాక్టర్ విశ్వేశ్వరరావుకు బంగారు పతకం



తెనాలిరూరల్: పట్టణ బోస్‌రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు దివంగత డాక్టర్ కొత్త రవీంద్రబాబు స్మారక ధార్మిక బంగారు పతకాన్ని గుంటూరుకు చెందిన ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ చేబ్రోలు విశ్వేశ్వరరావుకు బహూకరించారు. ఈ సందర్భంగా 'కామన్ యూరలాజికల్ ప్రాబ్లమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ గైడ్‌లైన్స్'పై డాక్టర్ విశ్వేశ్వరరావు ప్రసంగించారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. అనిల్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ మధుప్రభాకర్ బాబు, డాక్టర్ కె. శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ కొత్త రవీంద్రబాబు కుటుంబసభ్యులు, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

ఉరి పెట్టుకుని యువకుడు ఆత్మహత్య

రేపల్లె : మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే మనస్తాపంతో ఉరి పెట్టుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రేపల్లె పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. మూడవ వార్డుకు చెందిన కోనేటి రాజేష్ కుమార్ (34), లావణ్యలకు 11 సంవత్సరాల కిందట వివాహమైంది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మద్యానికి బానిసైన రాజేష్ కుమార్ డబ్బులు కోసం తరచూ భార్యను వేధిస్తూ ఉండేవాడు. బుధవారం మద్యానికి డబ్బులు అడగగా భార్య లేవని చెప్పడంతో చనిపోతానని బెదిరించాడు. అన్నట్లుగా మధ్యాహ్నం ఇంటిలో ఫ్యానుకు ఉరి పెట్టుకొని మృతి చెందాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాఫ్ట్‌బాల్ బాలికల జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో హెచ్‌ఎం విజయ, సాఫ్ట్‌బాల్ సెక్రటరీ సామంతరెడ్డి, శ్రీనివాసరావు, జనార్దన్ రెడ్డి యాదవ్, పీడీలు

సత్తెనపల్లి/రొంపిచర్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్ విభాగంలో జిల్లాస్థాయి బాలికల జట్టు ఎంపికలు సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం జరిగాయి. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది బాలికలు హాజరయ్యారు. వీరిలో 15 మందిని జట్టుకు, మరో ఐదుగురిని స్టాండ్‌బైకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో పల్లపాడుకు చెందిన సిహెచ్ అనిత, జి.సునందిని, ఎం.శృతి, సిహెచ్ పావని, బి.నందిని, కె.తేజస్విని, కె.చందన, ఇ.చంద్రిక, వి.లిద్య/ఎం.తిరుపతమ్మ, రొంపిచర్లకు చెందిన వి.శ్రీదేవి, పీవీఎస్ చంద్రిక, కొమెరపూడికి చెందిన బి.ప్రసన్న జ్యోతి, వినుకొండకు చెందిన ఆర్.రాగసుధ, క్రోసూరుకు చెందిన కె.దీవెన ఏంజల్, కేఎల్ఎస్ ప్రవల్లికలు ఉన్నారు. స్టాండ్ బైలుగా బి.శ్రీలక్ష్మి (రొంపిచర్ల), కె.సంజన (బ్రాహ్మణ కోడూరు), పి.శైలజ, జె.ధనలక్ష్మి, కె.తన్మయిసాయి (రామకృష్ణాపురం)లు ఎంపికయ్యారు. ఎంపికైన బాలికలు ఈనెల 30, 31 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ జిల్లా సెక్రెటరీ పి.సామంతరెడ్డి, జాయింట్ సెక్రెటరీ నర్రా శ్రీనివాసరావు, ట్రెజరర్ జనార్దన్ రెడ్డి యాదవ్‌లు పాల్గొన్నారు. ఎంపికలకు సెలక్షన్ కమిటీ మెంబర్లుగా పీడీలు సైదయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బారావులు వ్యవహరించారు. ఎంపికైన బాలికలకు గురువారం నుంచి కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమం జరుగుతుందని హెచ్‌ఎం బి.విజయ తెలిపారు.

పత్తిపై దిగుమతి సుంకం తొలగింపు సరికాదు

నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు



చిలకలూరిపేట: ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే పత్తి మీద అన్ని రకాల సుంకాలను మినహాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించటం దారుణమని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో మీడియాతో మాట్లాడుతూ ఈ నిర్ణయం పత్తి రైతులకు మరణ శిక్ష విధింపుతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా కూడా ఇది రైతు వ్యతిరేక చర్య అని ఖండించిందని వెల్లడించారు. పత్తిపై దిగుమతి సుంకాన్ని తొలగించే ప్రభుత్వ నోటిఫికేషన్ పత్తి రైతులపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశంలో పండించే పత్తి ధరపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందన్నారు. దేశీయంగా పండించే పత్తి ధర ఖచ్చితంగా తగ్గుతుందని, రైతులు మరింత అప్పుల పాలవుతారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం క్వింటా పత్తికి రూ.10,075 రావాలని, కానీ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7,710 మాత్రమే ఉందని వెల్లడించారు. ఆ ధరకు కూడా పత్తి అమ్ముడు పోవడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో దిగుమతి సుంకం ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పత్తి రైతులకు తీవ్రంగా నష్టపరుస్తుందన్నారు.

■ గత సంవత్సరం పండించిన పొగాకును సరైన ధరకు కొన్నవారే లేరని, ఇప్పటికీ సగం పొగాకు రైతుల వద్ద మిగిలిఉందని చెప్పారు. కంపెనీల చేత పొగాకుని ప్రభుత్వం కొలిపించలేకపోయిందని విమర్శించారు. రైతుల ఆందోళనలతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ సంస్థను పొగాకు కొనటానికి ఏర్పాటు చేసినప్పటికీ మార్క్ ఫెడ్ సంస్థ పొగాకును పూర్తిగా కొనలేదన్నారు.

■ మిర్చికి ఖర్చులు, తెగుళ్లు ఎక్కువగావటమే కాకుండా ధర కూడా పడిపోయిందన్నారు. ఇలాంటి స్థితిలో ఏ పంట వేయాలో తెలియనటువంటి తీవ్ర గందరగోళంలో రైతులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పత్తి దిగుమతులను ఆహ్వానించటం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతిచెందిన ఆవుల వెంకటేశ్వర్లు

వెల్దుర్తి: స్కూల్ బస్సు.. ద్విచక్రవాహనం ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతిచెందిన సంఘటన మండలంలోని మండాది గ్రామ సమీపంలోని కానాగు వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. మండలంలోని రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశ్వర్లు (28) రచ్చమల్లపాడు నుంచి మాచర్లకు వస్తుండగా.. మాచర్ల పట్టణానికి చెందిన సెయింటాన్స్ స్కూల్ బస్సు విద్యార్థులను మండాది గ్రామంలో వదిలిపెట్టేందుకు వస్తోంది.. ఈక్రమంలో నేషనల్ హైవే 565 కానాగు బ్రిడ్జి మీద స్కూల్ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న ఆవుల వెంకటేశ్వర్లు 25 అడుగుల లోతు గల కానాగులో ఎగిరి పడ్డాడు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన బంధువులు పోలీసులకు సమాచారమందించటంతో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఆరు నెలల కుమారుడు ఉన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు



ప్రమాద దృశ్యం

దాచేపల్లి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన సంఘటనలో దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామానికి చెందిన దొడ్డా శ్రీను(30) మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మిర్యాలగూడ నుంచి దాచేపల్లి వైపు వస్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ వాహనంలో గామాలపాడుకు చెందిన అన్నదమ్ములైన దొడ్డా సైదులు, దొడ్డా శ్రీను ఉన్నారు. కారు బలంగా ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం కిందపడి శ్రీనుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సైదులు తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన తర్వాత ఈ రెండు వాహనాలు రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన మరో ఆటోను బలంగా ఢీకొట్టాయి. ఆటో బోల్తాపడటంతో అందులో ఉన్న మరో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను పిడుగురాళ్లలోని వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడు శ్రీనుకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



మృతి చెందిన దొడ్డా శ్రీను

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



పంటను పరిశీలిస్తున్న ఏడీఏలు సునీత, రామకోటేశ్వరి

పొన్నూరు: సాగులో రసాయన ఎరువులను తగ్గించాలని గుంటూరు బయోలాజికల్ కంట్రోల్ ల్యాబ్ ఏడీఏ సునీత రైతులకు సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని వడ్డిముక్కల, ఆలూరు గ్రామాల్లో స్థానిక ఏడీఏ రామకోటేశ్వరితో కలిసి ఆమె పంట పొలాలను సందర్శించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ జీవన ఎరువులైన ఫాస్ఫరస్ సాల్యుబ్ లైజింగ్ బ్యాక్టీరియాను (పీఎస్‌బీ)వినియోగించడం వలన పొలంలో భాస్వరాన్ని కరిగించి పంటకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీని వలన ఎరువుల వినియోగం తగ్గించవచ్చని అన్నారు. ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ నగదు జమ కానివారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ పి. ప్రసాదు, ఎంపీఈఓ ఎస్. సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనీసం పదేళ్ల సర్వీసు ఉన్నవారు అవార్డులకు అర్హులని చెప్పారు. నేరారోపణలు, అభియోగాలు ఉన్న వారు అనర్హులని తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసులు లేవని తనిఖీ అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో పాటు జత పర్చాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులకు సంబంధించిన రెండు సెట్లను ఎంఈవో, డీవైఈవో, ఉర్దూ రేంజ్ ఉప తనిఖీ అధికారుల కార్యాలయాల్లో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని పేర్కొన్నారు. నమూనా దరఖాస్తును డీఈవోగుంటూరుబ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు తెలిపారు.